సర్దార్ సర్వాయి పాపన్న స్ఫూర్తితో ఉద్యమించాలి



సర్దార్ సర్వాయి పాపన్న శోభాయాత్రకు సంబంధించిన జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బహుజన రాజ్యాధికార ఉద్యమనేత సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ స్ఫూర్తితో పోరాటం చేయాలని జై గౌడసేన జాతీయ అధ్యక్షులు డాక్టర్ మోర్ల ఏడుకొండలు గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జై గౌడ సేన జాతీయ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న 374వ జయంతిని పురస్కరించుకొని సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ సేవా పురస్కారాలను పలువురికి అందజేశారు. అనంతరం ఈ నెల 18న ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో నిర్వహించనున్న సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ మహరాజ్ శోభాయాత్రకు సంబంధించిన జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏడుకొండలు గౌడ్ మాట్లాడుతూ కల్లుగీత వృత్తిపై తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. గౌడలు రాజకీయంగా ఎదిగిగౌడ సామాజిక వర్గం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. గౌడ ఐక్య సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షులు అంబాల నారాయణగౌడ్ మాట్లాడుతూ గౌడలలో ఐక్యత లోపించడం వల్లనే ఆర్థికంగా, సామాజికంగా వెనుకబాటుకు గురైయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా గౌడలు అన్ని యూనియన్‌లను పక్కనపెట్టి తమ హక్కుల కోసం పాపన్నగౌడ్ స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ సినీనటులు జైస్‌గౌడ్, రిటైర్డ్ డీఎస్పీ అశోక్‌కుమార్, జబర్దస్త్ ఫేమ్ అదిరే అభి, పంజాల శ్రావణ్‌కుమార్‌గౌడ్, చీకటి ప్రభాకర్, వీరస్వామిగౌడ్, కలర్ సత్తయ్య, చక్రవర్తి, లోహిత తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలపై మారణహోమం హేయమైన చర్య

ప్రొఫెసర్ హరగోపాల్



ఆదివాసీలపై జరుగుతున్న హింసను ఆపాలని ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆదివాసీలపై కొనసాగిస్తున్న మారణకాండ హేయమైన చర్య అని ప్రొఫెసర్ హరగోపాల్ విమర్శించారు. తమ హక్కుల కోసం పోరాడుతున్న ఆదివాసీలపై హింసను ప్రయోగించడం దుర్మార్గమైన చర్య అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన అఖిల భారత రెండవ రోజు సదస్సులో హరగోపాల్ మాట్లాడారు. పౌర హక్కులను కాలరాసే విధంగా నిర్బంధ చట్టాలను ప్రయోగిస్తునారని విమర్శించారు. ఆదివాసీలు జీవించే హక్కులు కాలరాస్తున్నారని 2005 నుంచి వారిపైన హింస కొనసాగుతూనే ఉందన్నారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాపాడుకోవడానికి జీవన మరణ ఉద్యమాలు నిర్వహిస్తున్నారన్నారు. ప్రొఫెసర్ కొదండరామ్ మాట్లాడుతూ ఆదివాసీల కోసం రాజ్యాంగంలో ఏర్పాటు చేసుకున్న అన్ని చట్టాలను ప్రభుత్వాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. వారి జీవించే హక్కుకు భద్రత కల్పించాలన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో కొనసాగిస్తున్న పోరును వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ప్రముఖ సైంటిస్టు బాబురావు మాట్లాడుతూ కార్పొరేట్ వ్యవస్థను ప్రోత్సహించడానికి అడవుల్లో ఉన్న సంపద అంతా కొల్లగొడుతున్నారని అందుకే ఆదివాసీలపై హింస కొనసాగిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఆదివాసీలకు రాజ్యాంగపరమైన హక్కులను పరిరక్షించడానికి ఐక్య ఉద్యమాలు నిర్మించాలని, ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని పోడు భూములకు హక్కులు ఇవ్వాలని తీర్మానించారు. అనంతరం ఆదివాసీలపై కొనసాగిస్తున్న హింసను నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్, ప్రముఖ సామాజికవేత్త సోనీ, డాక్టర్ కిషోర్‌కుమార్, డాక్టర్ ఈశ్వర్ గజ్వేల్లి, ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు పెల్లయ్యనాయక్ పాల్గొన్నారు.



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

బీజేపీలో కష్టపడే ప్రతి కార్యకర్తకు గుర్తింపు

చిక్కడపల్లి: బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కోవా.లక్ష్మణ్ రాజ్యసభ విప్‌గా నియమితులైన సందర్భంగా ముషీరాబాద్ బీజేపీ కన్వీనర్ మల్లంపేట రమేష్‌రామ్ శనివారం అశోక్‌నగర్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలసి శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ కోవా లక్ష్మణ్ మాట్లాడుతూ బీజేపీలో కష్టపడే ప్రతి కార్యకర్తకు తప్పక గుర్తింపు ఉంటుందని అన్నారు. పార్టీ అభివృద్ధి కోసం తను మరింత అంకితభావంతో పనిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ రఘునాథ్, హరినాథ్‌గౌడ్‌లు పాల్గొని లక్ష్మణ్‌ను అభినందించారు.

ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీగా నర్సయ్య

అంబర్‌పేట: ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీగా జె.నర్సయ్య బాధ్యతలు తీసుకున్నారు. శనివారం ఆయన కార్యాలయంలో బాధ్యతలు తీసుకొని మాట్లాడుతూ..శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ప్రజలకు, పోలీసులకు మధ్య సత్సంబంధాలు ఉండేలా చొరువ తీసుకుంటానన్నారు. 1991లో ఎస్సైగా ఎంపికై తెలంగాణ వ్యాప్తంగా వివిధ హోదాల్లో విధులు నిర్వహించారు. నగరంలో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్‌గా ఆసిఫ్‌నగర్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా, కాచిగూడ ఏసీపీగా వరంగల్ జిల్లాలో డీఎస్పీగా, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా తనదైన శైలిలో విధులు చేపట్టారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు

కాచిగూడ: విద్యతోనే ఉన్నత శిఖరాలు చేరుకోవడం సాధ్యమని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. శనివారం కాచిగూడలోని వైశ్య హాస్టల్‌లో ఏర్పాటు చేసిన డీలక్స్ రూమ్స్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్‌బుక్స్, స్కాలర్‌షిప్స్ అందజేశారు. వైశ్య హాస్టల్ విద్యార్థి హర్షిత్ సాయి ఇంటర్‌లో రాష్ట్ర స్థాయి 4వ ర్యాంకు సాధించినందుకు ఆయన ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకుని ముందుకు సాగాలని సూచించారు. చాలా మంది విద్యార్థులు ఉన్నత చదువులు చదివినా తగిన ఉద్యోగం లభించడం లేదని, దీనికి కారణం స్కిల్స్ లేకపోవడమేనన్నారు. విద్యాభివృద్ధికి వైశ్య హాస్టల్ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. వైశ్య హాస్టల్ ట్రస్ట్ బోర్డు చైర్మన్ జి.ధనుంజయ్, కార్యదర్శి విశ్వనాథం నాగేష్, కుర రఘువీర్, ఉప్పాల రాజేశ్వర్, పబ్బతి రవి ప్రసన్న కుమార్, పొద్దుటూరి రాజేశ్వర్ రావు, గౌరిశెట్టి చంద్రయ్య, కొత్రికే భాస్కర్ గుప్తా, కొత్తురు జయప్రకాష్ రామ్, కూర జయరాములు గుప్త, మ్యాడం దయాకర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.


‘రిజర్వేషన్లు పెంచకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించొద్దు’



మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

కాచిగూడ: అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లను పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్లు పెంచకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే కాంగ్రెస్ పార్టీకి బీసీలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. తెలంగాణలో చేపట్టనున్న కులగణన ఆలస్యమవుతుందనే నేపంతో స్థానిక సంస్థల ఎన్నికలను బీసీ రిజర్వేషన్లు పెంచకుండానే కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం నిర్వహించే ప్రయత్నాలను ముమ్మరం చేస్తోందని ఆరోపించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో బీసీ రిజర్వేషన్ల సాధన కోసం తెలంగాణలో గ్రామ స్థాయి నుంచి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు మల్లేష్ యాదవ్, వేముల రామకృష్ణ, నందగోపాల్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

బాబాల పేరుతో జరుగుతున్న దోపిడీపై విచారణ జరిపించాలి



మాట్లాడుతున్న విజ్ఞాన దర్శిని అధ్యక్షుడు రమేష్

కాచిగూడ: బాబాల పేరుతో జరుగుతున్న అక్రమ దోపిడీపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని విజ్ఞాన దర్శిని అధ్యక్షుడు రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో కొంతమంది బాబాలు ఆధ్యాత్మికతను వ్యాపారంగా మార్చుకొని ప్రజలను ఆర్థికంగా, లైంగికంగా దోచుకుంటున్నారని ఆరోపించారు. యూపీ అత్రాసల్‌లో భోలే బాబా ఘటన ఈ బాబాల వల్ల సమాజానికి జరుగుతున్న నష్టాన్ని తెలియజేస్తుందన్నారు. నిర్మల్ పట్టణానికి చెందిన శివరాజ యోగి కృష్ణస్వామి కోట్ల రూపాయల ఆశ్రమాన్ని నిర్మించుకొని పెద్ద వ్యాపార సామ్రాజ్యాన్ని నెలకొల్పాడన్నారు. బాధిత మహిళలు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోతుందని ఆయన వాపోయారు. నారాయణపేట జిల్లా మద్దూరు మండల కేంద్రంలో మహబూబ్ ఆలీ అనే బాబా దయ్యాలు, భూతాలు వెంటాడుతున్నాయని భయపెడుతూ తాను ఆ దేవుడి రూపంలో ఉన్నానని దయ్యాలను, భూతాలను, సైతాన్‌లను వదిలిస్తానని కర్రలతో, కొరడాలతో కొడుతూ చిత్రహింసలకు గురి చేస్తున్నాడన్నారు. ఇలాంటి వారితో ప్రశాంతంగా ఉండే గ్రామాల్లో బాణామతి, చేతబళ్ల పేరుతో దాడులు కూడా జరుగుతున్నాయన్నారు. వీరిని నియంత్రించడానికి ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు.

12న చలో జీహెచ్ఎంసీ పోస్టర్ ఆవిష్కరణ

ముషీరాబాద్: నగరంలో డెంగీ, మలేరియా, వైరల్ ఫీవర్ లాంటి వ్యాధులు విజృంభిస్తున్నాయని వాటిని అరికట్టేందుకు చర్యలు సరిగ్గా తీసుకోవడం లేదని ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ (పీ.వై.ఎల్) గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రవికుమార్, బిఎస్.కృష్ణలు అన్నారు. శనివారం మార్క్స్ భవన్‌లో చలో జీహెచ్ఎంసీ కార్యాలయం ముందు నిరసనకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. మనోహర్, సాయి, ప్రసాద్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పేదింటి అమ్మాయిల పెళ్లిళ్లకు సహాయం చేస్తాం

ముషీరాబాద్: కులమతాలకు అతీతంగా పేదింటి అమ్మాయిల పెళ్లికి అన్ని విధాలా సహాయ, సహకారాలు అందించి ఆదుకుంటామని అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. శనివారం ముషీరాబాద్ ఆర్యవైశ్య భవన్‌లో పేద కుటుంబాలకు చెందిన అమ్మాయిల పెళ్లికి కావాల్సిన పుస్తె మెట్టెలు,దుస్తులు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ ఐవీఎఫ్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదలను ఆదుకుంటున్నామన్నారు. విద్యా, వైద్యం అందిస్తున్నామన్నారు. ఉప్పల స్వప్న, సత్తయ్య, చంద్రశేఖర్,శ్రీనివాస్, భాగ్యలక్ష్మి, గంజి రాజమౌళి గుప్తా, నాయకులు లక్ష్మి, రమ పాల్గొన్నారు.

శ్రావణమాస బోనాలు

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లోని శ్రీ లక్ష్మీ ఉప్పలమ్మ దేవాలయంలో ఆదివారం శ్రావణమాస బోనాలు అత్యంత ఘనంగా నిర్వహించడం జరుగుతుందని దేవాలయం అధ్యక్షుడు వై.సంజీవరెడ్డి, కోశాధికారి ఎం.ఎస్.పవన్‌కుమార్‌లు తెలిపారు.

సన్మానం



సుప్రీంకోర్టు న్యాయవాది సిద్ధార్థ లూద్రాను సత్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అంబర్‌పేట: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు సానుకూల తీర్పు కోసం వాదించిన న్యాయవాది సిద్ధార్థ లూద్రాకు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ నాయకుడు, రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య కృతజ్ఞతలు తెలిపారు. శనివారం ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో కలిసి సత్కరించారు. 30 ఏళ్లుగా మాదిగ ఉపకులాల వర్గీకరణ కోసం జరుగుతున్న పోరాటానికి న్యాయవాది సిద్ధార్థ లూద్రా అందించిన సహకారం మరువలేనిది అని మేడి పాపయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గెల్వయ్య, కొమ్ము ప్రవీణ్‌కుమార్,డీఎస్ రాజు, గురుగల శ్రీనివాస్, కె.మోహన్, ఎం.యాదగిరి తదితరులు ఉన్నారు.

మందకృష్ణకు ఘనస్వాగతం పలుకుదాం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఎస్సీ వర్గీకరణ సాధించుకొని ఈ నెల 13వ తేదీన బేగంపేట విమానాశ్రయానికి వస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణమాదిగకు ఘన స్వాగతం పలికేందుకు పెద్ద ఎత్తున మాదిగలు తరలిరావాలని ఎమ్మార్పీఎస్ ముషీరాబాద్ ఆధ్వర్యంలో రాంనగర్ డివిజన్‌లోని వివిధ బస్తీల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని పాలమూరు బస్తీలో ఇంటింటికి తిరిగి బేగంపేట విమానాశ్రయానికి తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గండి కృష్ణమాదిగ, నాగార్జున మాదిగ, శ్రీనివాస్ మాదిగ, సాయిలు, ముచ్చనపల్లి రాములు, కుమ్మరి శ్రీనివాస్, దశరథ్, తోట్ల గోపి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాభివృద్ధితోనే ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ డాక్టర్ ఎం.రాములు

కాచిగూడ: నైపుణ్యాభివృద్ధి కలిగిన యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు కొదవ లేదని ఉస్మానియా యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.రాములు అన్నారు. శనివారం కాచిగూడలోని బద్రుకా కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ ఆర్ట్స్, బద్రుకా ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో 'సయోనరా–2024' పేరుతో కళాశాల వార్షికోత్సవం, విద్యార్థుల వీడ్కోలు వేడుకలు ఘనంగా జరిగాయి. అకాడమిక్‌లో ర్యాంకులు, ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు, ఎన్‌సీసీ రిపబ్లిక్ డే క్యాంపునకు వెళ్లిన క్యాడెట్స్‌కు, ఎన్ఎస్ఎస్‌లో రిపబ్లిక్ డే క్యాంపునకు వెళ్లిన విద్యార్థులకు క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన విద్యార్థులకు ఈ సందర్భంగా బహుమతులు, సర్టిఫికెట్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో బద్రుకా పూర్వ విద్యార్థి, పెన్నార్ ఇండస్ట్రీస్ సీఎఫ్ఓ శ్రీకాంత్ భక్కడ్, కళాశాల సెక్రెటరీ శ్రీకిషన్ బద్రుకా, డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ అభిరామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.మోహన్ కుమార్, డాక్టర్ పి.వెంకటయ్య, డాక్టర్ ఎం.జానకిరామ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు సామాజిక స్పృహ ఉండాలి



కల్చరల్ ఫెస్ట్-2024ను ప్రారంభిస్తున్న డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి తదితరులు



ఫ్యాషన్ షోలో పాల్గొన్న విద్యార్థులు

ముషీరాబాద్: విద్యార్థులు చదువుతో పాటు సంస్కారం, సామాజిక స్పృహ కలిగి ఉండాలని ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి సూచించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, గురువులు చెప్పే మాటలు విని తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆయన సూచించారు. విద్యానగర్‌లోని హోటల్ సురభి గ్రాండ్‌లో శనివారం ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాల విద్యార్థుల కల్చరల్ ఫెస్ట్–2024 జరిగింది. ఈ కార్యక్రమానికి చైర్మన్ నరేందర్‌రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐఐటీ, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన ఫ్యాషన్ షో, ఇతర కల్చరల్ కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డి.సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ స్వప్నతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా రాజ్యాంగబద్ధమే

కవాడిగూడ: షెడ్యూల్డ్ కులాల వారికి మతస్వేచ్ఛ కల్పించాలని, జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్ నివేదికను అమలు చేస్తూ దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదాను కల్పించాలని, దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కోసం శాసన సభలో తీర్మానం చేయాలని పలువురు వక్తలు తీర్మానం చేశారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని షెడ్యూల్డ్ కులాల వారికి మతస్వేచ్ఛను కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా క్రిష్టియన్ ఫెడరేషన్ (ఏఐసిఎఫ్) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గిడియన్ బాబు అధ్యక్షతన శనివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ పీఎల్‌విశ్వేశ్వర్‌రావు, కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. స్కైలాబ్ బాబు, దళిత స్త్రీశక్తి, జాతీయ వ్యవస్థాపక అధ్యక్షురాలు గడ్డం ఝాన్సీ, తెలుగు క్యాతలిక్ బిషప్ కౌన్సిల్, డిప్యూటీ సెక్రెటరీ రెవరెండ్ రాజు అలెక్స్ తదితరులు హాజరై మాట్లాడారు. భారత రాజ్యాంగానికి వ్యతిరేకంగా, దేశపౌరుల మత స్వేచ్ఛకు విరుద్ధంగా రాష్ట్రపతి ఉత్తర్వులు (షెడ్యూల్డ్ కులాల) 1950లో 3వ పేరా అమలులోకి వచ్చిన ఆగస్టు 10న దళిత క్రైస్తవుల నిరసన దినంగా పాటించాలని వారు పిలుపునిచ్చారు. దేశంలో జరుగుతున్న దళిత క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని నిరుపేద ఫాస్టర్లకు గౌరవ వేతనం ఇవ్వాలని, క్రైస్తవుల సమాధుల కోసం స్థలాలు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో నాయకులు టి. భాస్కర్, ఎస్ శంకర్ వివిధ చర్చీలకు చెందిన ఫాస్టర్‌లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



రాజ్యాధికారం దిశగా మున్నూరుకాపులు ఉద్యమించాలి

కాచిగూడ: రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో వెనుకబడిన మున్నూరుకాపుల అభివృద్ధి జరగాలంటే రాజ్యాధికారం దిశగా మున్నూరుకాపులు పోరాటం చేయాలని మున్నూరుకాపు సంఘం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చల్లా హరిశంకర్ అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, బడుగు బలహీన వర్గాల ప్రజలందరినీ కలుపుకొని పోతూ రాజ్యాధికారం సాధించాలని అన్నారు. శనివారం బర్కత్‌పురలోని మున్నూరుకాపు సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 11న ఆదివారం మున్నూరుకాపు సంఘం, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సమావేశం బర్కత్‌పురలోని సంఘ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో పలు సమస్యలపై చర్చించి చేపట్టాల్సిన కార్యక్రమాలపై తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఆర్‌వీ మహేందర్ కుమార్, జె.వెంకటేశ్వర్లు, వాసాల వెంకన్న,వెంకటేశ్వర్లు, దేవిశెట్టి శివ పాల్గొన్నారు.

ఉపాధిరంగ కోర్సులలో శిక్షణ పొందాలి

ముషీరాబాద్: ఉపాధి రంగ కోర్సుల్లో యువత శిక్షణ పొంది ఆర్థికంగా ఎదగాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. శనివారం టెక్ మహేంద్ర ఫౌండేషన్, అప్సా స్వచ్ఛంద సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత నైపుణ్య శిక్షణ కోర్సులను యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లిష్, టైపింగ్ తదితర రంగాలలో టెక్ మహేంద్ర, అప్సా స్వచ్ఛంద సంస్థలు నిరుద్యోగులకు ఉచితంగా శిక్షణ ఇస్తూ వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతుందన్నారు. శిక్షణ కేంద్రం మేనేజర్ షేక్ మౌలా మాట్లాడుతూ 10వ తరగతి పాసైన వారు 18–27 సంవత్సరాల మధ్య వయస్సు గల నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. మరిన్ని వివరాలకు 9154990135లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రవిప్రకాష్, జయశ్రీ, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

ముషీరాబాద్: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కో కన్వీనర్ సయ్యద్ మోహిన్ అన్నారు. శనివారం భోలక్‌పూర్‌లో బైబిల్‌హౌస్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా సయ్యద్ మోహినోద్దీన్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకోని వాడవాడలా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. మలేరియా డిపార్ట్‌మెంట్ సిబ్బందితో పాటు ఏఎన్ఎం లక్ష్మిబాయి, ప్రేమలత, నాయకులు శ్రీనివాస్, సత్యనారాయణ, వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాన్ని కూల్చివేయాలని ఫిర్యాదు

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్‌లోని కళాధార్‌నగర్‌లో అక్రమంగా నిర్మించిన భవనాన్ని కూల్చివేయాలని కోరుతూ కళాధర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. శనివారం కళాధర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్‌కుమార్, ఉపాధ్యక్షులు నరేందర్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నాగరాజు, కోశాధికారి సతీష్‌బాబులు మాట్లాడుతూ కళాధర్‌నగర్ పార్కు సమీపంలో ఫుట్‌పాత్ స్థలాన్ని ఆక్రమించి ఎలాంటి అనుమతులు లేకుండా నాలుగంతస్తుల భవనం నిర్మించారని తెలిపారు. జీహెచ్ఎంసీ నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండా కాలనీ లేఅవుట్‌కు విరుద్ధంగా నిర్మాణ పనులు చేపట్టడం వల్ల కాలనీ వాసులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. ఇప్పటికైనా అధికారులు అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని డిమాండ్ చేశారు.

వైద్య శిబిరానికి స్పందన

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రతిమ ఆసుపత్రి కాచిగూడ సహకారంతో శనివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా సుమారు 500 మంది వాకర్స్‌కు ఉచితంగా బీపీ, షుగర్, ఈసీజీ, 2డి ఏకో టెస్టులను ఉచితంగా నిర్వహించారు. అనంతరం ఆసుపత్రికి సంబంధించిన వైద్యులు తగిన సలహాలు, సూచనలు అందజేశారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షులు ఆర్.వివేక్, ప్రతిమ ఆసుపత్రి జీఎం విజయ్, అసిస్టెంట్ మేనేజర్ సుభాష్, విజయ్‌కుమార్, డాక్టర్ నిఖిత, డాక్టర్ పి.వి.రాచల్, క్లబ్ మాజీ అధ్యక్షులు వి.నాగభూషణం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శివ శంకర్ జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చాలి



నివాళులర్పిస్తున్న కట్టెల సుభాష్, అజయ్ కుమార్ తదితరులు



శివ శంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రొ. మ్యాడం వెంకట్‌రావు, పిల్లి శ్రీనివాస్‌రావు

కాచిగూడ: ప్రముఖ న్యాయకోవిదులు, మాజీ కేంద్ర మంత్రి జస్టిస్ పుంజాల శివశంకర్ జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాలలో చేర్చాలని మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ మ్యాడం వెంకట్‌రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శివశంకర్ 75వ జయంతి సందర్భంగా శనివారం కాచిగూడలోని మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం మ్యాడం అంజయ్య హాల్‌లో ఆయన జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు, విద్యావేత్తలు, కుల సంఘాల ప్రతినిధులు పాల్గొని శివశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్ రావుతో కలిసి ఆయన మాట్లాడుతూ.. కేంద్ర న్యాయశాఖ మంత్రిగా శివశంకర్ అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో దడువై రాఘవేందర్, ఎలగందల దేవేందర్, అమరం చంద్రశేఖర్, చామకూర సుజాత, ఎన్.అన్నపూర్ణ, గోపిశెట్టి ప్రమోద్, దేవరశెట్టి ప్రభాకర్, ఓంప్రకాష్, ఆవుల రమేష్, కావేటి గోవింద్ పాల్గొన్నారు.

శివశంకర్ మరణం కాంగ్రెస్‌కు తీరనిలోటు

నల్లకుంట: పేదల సంక్షేమం కోసం నిరంతరం పరితపించిన కేంద్ర మాజీ మంత్రి దివంగత పుంజాల శివశంకర్ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని టీపీసీసీ ఓబీసీ వైస్ చైర్మన్ కట్టెల సుభాష్ అన్నారు. ఉమ్మడి ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా నిష్పక్షపాతమైన తన తీర్పులతో పేద ప్రజలకు న్యాయం చేకూర్చారని కొనియాడారు. కట్టెల సుభాష్ ఆధ్వర్యంలో శివ శంకర్ జయంతిని శనివారం తిలక్‌నగర్ చౌరస్తా సమీపంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ ఓబీసీ విభాగం వైస్ చైర్మన్ కట్టెల సుభాష్, టీపీసీసీ కార్యదర్శి అజయ్ కుమార్, రామ్మోహన్ తదితరులు ఘన శివశంకర్ చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రామ్మోహన్ రావు, సీహెచ్.మురళీ కృష్ణ, మహేష్ యాదవ్, మధు, మధుసూదన్ రెడ్డి, కె.ప్రభుదాసు, నాని, రమణారెడ్డి, కె. గోవర్ధన్‌రెడ్డి, గుండెం రమేష్ చంద్ర పాల్గొన్నారు.

శివశంకర్ పోరాటం ఎనలేనిది

ముషీరాబాద్: రాష్ట్రంలో బీసీ కులాల గుర్తింపు, సామాజిక న్యాయం కోసం మాజీ కేంద్ర మంత్రి పి.శివశంకర్ పోరాడారని అని కాంగ్రెస్ ఓబీసీ సెల్ జాతీయ విభాగం మాజీ చైర్మన్ డాక్టర్ పి.వినయ్‌కుమార్ కొనియాడారు. శనివారం అడిక్‌మెట్ డివిజన్‌లోని లలితానగర్ కమ్యూనిటీహాల్‌లో ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ మోహిద్ ఆధ్వర్యంలో మాజీ కేంద్ర మంత్రి పి.శివశంకర్ 95వ జయంతి సందర్భంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన డాక్టర్ పి.విజయ్‌కుమార్ పి.శివశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1956లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన తరువాత రాష్ట్రంలోని బీసీ కులాల జాబితా కోసం పోరాటం చేశారని తెలిపారు. ఆయన చేసిన పోరాటం వల్ల రాష్ట్రంలో 112 బీసీ కులాలను గుర్తించి అప్పటి ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అప్పటి నుంచి బీసీలకు రాజ్యాంగపరంగా రావాల్సిన విద్య, ఉద్యోగ, రాజకీయ వాటా కోసం శివశంకర్ పోరాటం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి జీఎన్ కేశవ్, నాయకులు నామ్‌దేవ్, రషీద్, జి.నాగేందర్, నరేందర్, బల్వంత్, విజయ్‌కుమర్‌యాదవ్, సాయిముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ పి.వినయ్‌కుమార్ తదితరులు